

నేడు యథావిధిగా పిజిఆర్ఎస్ : కలెక్టర్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ప్రజా సమస్యలు పరిష్కార కోసం జిల్లా, డివిజన్ మండల స్థాయిలో నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ సోమవారం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 1100 - మీకోసం కాల్ సెంటర్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చని, అలాగే అర్జీ స్థితిగతులను తెలుసుకోవచ్చని ఆమె ప్రజలకు సూచించారు. అలాగే అర్జీలను meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లోనూ నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. నేరుగా అర్జీలు ఇవ్వలేని వారు వెబ్ సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు నమోదు చేసుకోవచ్చాన్నారు. కలెక్టరేట్, డివిజన్, మున్సిపల్; మండల కేంద్రాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ పిజిఆర్ఎస్‌ను నిర్వహిస్తామన్నారు. అధికారులు తప్పనిసరిగా హాజరవ్వాలన్నారు.

అన్నదాత సుఖీభవ ఎప్పుడో?

- నేటికీ పూర్తి కాని అర్హుల జాబితాలు
- రూ.20వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో కూటమి హామీ
- పది నెలలైనా పైసా విదల్చని వైనం

ప్రజాశక్తి - కొవ్వూరు

తాము అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకూ ఏడాదికి రూ.20వేలు ఆర్థిక సాయం అందిస్తామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు గొప్పగా ప్రకటనలు గుప్పించారు. తీరా అధికారంలోకి వచ్చి పదినెలలు దాటినా ఇంత వరకూ అన్నదాతకు ఒక్క పైసా సాయం కూడా అందించలేకపోయింది. కూటమి సర్కారు అధికార పగ్గాలు చేపట్టిన తరువాత రెండు పంట సీజన్‌లు ముగిశాయి. రెండు సీజన్లలోనూ రైతులు పండించిన ధాన్యం అమ్ముకోవడానికే తీవ్ర ఒడిదుడుకులను చవిచూశారు. లక్ష్యం పూర్తయ్యిందని చెప్పి ధాన్యం కొనుగోళ్లు చేయకపోవడం, ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి సకాలంలో సొమ్ములు సైతం చెల్లించలేని పరిస్థితి. దీంతో రైతులు ఇప్పటికీ రోడ్డెక్కి ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. అయినప్పటికీ ప్రభుత్వంలో చలనం లేదు. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో 1.22 లక్షల మంది రైతులకు వైఎస్ఆర్ రైతు భరోసా పేరుతో ఏడాదికి రూ.1,3500 చొప్పున పిఎం కిసాన్ సొమ్ములతో కలిపి చెల్లించేవారు. నాలుగేళ్ల కాలంలో రూ.548.64 కోట్ల మంది రైతులు లబ్ధిపొందారు. ఈ సారి 2.50 లక్షల మందికి పైగా రైతులకు అన్నదాత సుఖీభవ సాయం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇంత వరకూ జిల్లాలో అర్హుల జాబితాలు సైతం సిద్ధం కాలేదు.ఇంకా దరఖాస్తుల పరిశీలన, అర్హత నిర్ధారణ దశలోనే ఉన్నాయి. ఇటువంటి తరుణంలో ఖరీఫ్‌కు రైతులు సన్నద్ధం అవుతున్నారు.అన్నదాత సుఖీభవ కింద అందించే కొద్దిపాటి సాయమైనా సకాలంలో చెల్లిస్తే పెట్టుబడికి ఉపకరిస్తాయని రైతులు భావిస్తున్నారు. వ్యవసాయ పనులు ప్రారంభానికి నెల రోజులు ముందే అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు సాయం అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల ప్రకటించారు. మే నెలలోనే రైతుల ఖాతాలో సాయం సొమ్ము జమ చేస్తామన్నారు. ఈ హామీ ఇంకా కార్యరూపం దాల్చక పోవడంపట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



వరిశీలనతో కాలక్షేపం?

జిల్లా వ్యాప్తంగా 2,52,002 మంది రైతులు అన్నదాత సుఖీభవ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులను వ్యవసాయ, రెవెన్యూ అధికారులు మూడు దశల్లో పరిశీలన చేస్తున్నారు. రైతు సేవా కేంద్రం పరిశీలన చేసి 2,01,108 మంది పేర్లను ప్రాథమికంగా ధ్రువీకరించారు. 16,332 మందిని తిరస్కరించారు. ఇంకా 26,108 దరఖాస్తులను పరిశీలించాల్సి ఉంది. రెండో దశలో మండల వ్యవసాయ శాఖ అధికారి లాగిన్‌లో ప్రాథమికంగా అర్హత జాబితాలను పరిశీలించి 254 మంది పేర్లను తిరస్కరించారు. మొత్తం 1,72,763 మంది పేర్లను అప్రూవ్డ్ చేశారు. మరో 28,344 మంది దరఖాస్తులను పరిశీలించాల్సి ఉంది. ఇంత వరకూ తహశీల్దార్ లాగిన్‌కు 9,233 మంది పేర్లను పంపించారు. వీటిలో 3,312 మందిని తిరస్కరించారు. 1,036 మంది అర్హులుగా నిర్ధారించారు. ఇంకా తహశీల్దార్ లాగిన్‌లో 4,885 మంది పేర్లను పరిశీలించాల్సి ఉంది. మొత్తం దరఖాస్తు దారుల్లో ఇప్పటి వరకూ 19,902 మంది పేర్లు తిరస్కరణకు గురైనట్టు అధికారులు చెబుతున్నారు. మండల వ్యవసాయాధికారి పరిశీలన అనంతరం తహశీల్దార్ లాగిన్‌లో రెవెన్యూ అధికారులు అర్హతలను పరిశీలించాల్సి ఉంది. ఈ ప్రక్రియ అంతా పూర్తి కావడానికి మరికొంత కాలం సమయం పట్టే అవకాశం ఉంది.

కౌలు రైతుల పరిస్థితి దయనీయం

జిల్ల వ్యాప్తంగా ఈ ఏడాది 1.10 లక్షల మంవది కౌలుదారులకు సిసిఆర్‌సి కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు. 11 నెలల కాలపరిమితికి గాను అందించే ఈ కార్డులు ఇంత వరూ 9,936 మందికి మాత్రమే అందాయి. గతేడాది జూన్‌లో కార్డులు పొందిన కైలుదారుల కార్డులను ఈ ఏడాది మేలో రెన్యువల్ చేశారు. గత జులైలో 32వేల మంది కార్డులు పొందారు. వీరికి ఈ ఏడాది జూన్‌లో రెన్యువల్ చేస్తారు. అంటే మొత్తం కౌలుదారుల్లో ప్రస్తుతం ప్రభుత్వం అన్నదాత సుఖీభవ సాయం అందించినా కేవలం 9,936 మందికి మాత్రమే అందే అవకాశం ఉంది. మిగిలిన వాళ్లలో జూన్‌లో రెన్యువల్ ప్రక్రియ పూర్తికావాలి, కొత్తగా కార్డులు జారీ చేయాలన్నా చాలా సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో కౌలు రైతులకు ఈ సీజన్‌లో అన్నదాత సుఖీభవ సాయం అందడం గగనమే. అన్నదాత సుఖీభవ సాయం ఏడాది మూడు విడతలు కింద అందిస్తారు. దీనిలో ఏప్రిల్-జూన్ మాసం లోపు, జులై-సెప్టెంబర్ మధ్య, నవంబర్-మార్చి మధ్య మరోసారి అందిస్తారు. ఈ లెక్కన కార్డులు పొంది కొందరి కౌలురైతులకే ఈ సాయం అందనుంది.

దరఖాస్తులను పరిశీలిస్తున్నాం...



జిల్లాలో అన్నదాత సుఖీభవ దరఖాస్తులను పరిశీలిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా 2.50 లక్షల మంది నుంచి దరఖాస్తులు అందాయి. వీటిని రైతు సేవా కేంద్ర స్థాయిలో ప్రాథమిక పరిశీలన పూర్తి చేశాం. మండల వ్యవసాయ అధికారులు, రెవెన్యూ అధికారులు అర్హతలను పరిశీలన చేస్తున్నారు. పరిశీలన ప్రక్రియ పూర్తికాగానే అర్హుల జాబితాలను సిద్ధం చేస్తాం.

- ఎన్.మాధవరావు, జిల్లా వ్యవసాయ అధికారి



స్తూపాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు

ప్రజా ఉద్యమాలే అమరులకు నిజమైన నివాళి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
నీలపల్లిలో తొలితరం కమ్యూనిస్టులకు స్తూపం ఆవిష్కరణ

ప్రజాశక్తి- తాళ్లరేవు

సమ సమాజ స్థాపనకు ప్రజా ఉద్యమాలు చేయడమే తొలితరం కమ్యూనిస్టులకు నిజమైన నివాళి అర్పించడమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. తాళ్లరేవు మండలం నీలపల్లి సిద్ధార్థ నగర్‌లో నీలపల్లి గ్రామ తొలితరం కమ్యూనిస్టుల స్మారక స్తూపాన్ని శ్రీనివాసరావు ఆదివారం ఆవిష్క రించారు. తొలుత సిపిఎం జెండాను ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు ఆవిష్కరించారు. అనంతరం సిపిఎం మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో విఎస్ఆర్ మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న వీరులకు రక్షణగా నిలబడి, తాళ్లరేవు మండల ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీని నిర్మించిన తొలితరం కమ్యూనిస్టు నాయకులు కమిడి వెంకటనారాయణ, మాతా వేమనాచార్యులు, దడాల మహాలక్ష్మి, మేడిశెట్టి నీలాద్రి, అనంతర కాలంలో కమిడి సుధాకర్ పోలీ సుల నిర్బంధాలను తట్టుకుని వీరోచితంగా పోరా డారన్నారు. వారి సేవలు చిరస్మర ణీయమన్నారు. ఈ ప్రాంతంలో రెండవ తరంలో ప్రజా ఉద్యమాలు నిర్మించి ప్రముఖ వైద్యునిగా స్థిరపడిన చెక్కా సింహాచలం ఆర్థిక సహకారంతో ఈ స్తూపాన్ని నిర్మించినట్లు సిపిఎం పార్టీ జిల్లా నాయకులు కెఎస్.శ్రీనివాస్ తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ వైద్యులు చెక్కా సింహాచలం మాట్లాడుతూ ఆనాటి రోజుల్లో గ్రామాల్లో అగ్రకుల అధిపత్యాన్ని కమ్యూనిస్టుల ప్రభావంతో యువత ప్రశ్నించడంతో ఆదిపత్యం తగ్గిందన్నారు. అయినా మళ్లీ చాప కింద నీరులా అగ్రకులాధిపత్యం కొనసాగుతుందని తెలిపారు. రాజ్యాంగాన్ని, దేశాన్ని రక్షించుకోవాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. కమ్యూనిజం, అంబేద్కరిజంను కాపాడుకోవాల్సిన అవసరం ఆవశ్యమన్నారు. ఈ స్తూపం పనులు సీనియర్ జర్నలిస్ట్ పొనుగుమట్ల అశోక్ కుమార్, సిపిఎం జిల్లా నాయకులు మోర్త రాజశేఖర్ పూర్తి చేశారని సిపిఎం మండల కార్యదర్శి కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా తొలి తరం కమ్యూనిస్టులు దడాల మహాలక్ష్మి వారసులు దడాల ఆంజనేయులు, మాత వేమణాచార్యులు వారసులు నాగభూషణం లను రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావులను ఘనంగా సత్కరించారు. సభలో కళాకారులు ఆలపించిన విప్లవ గీతాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు కెఎస్.శ్రీనివాస్, ఎం.రాజశేఖర్, డి.శేషబాబ్జి, పలివెల వీరబాబు, సిహెచ్.రమణి, మండల నాయకులు వల్లు రాజబాబు, దుప్పి అదష్టదీపుడు, వెంకటలక్ష్మి, నేరేడుమిల్లి త్రిమూర్తులు, పాలెపు ఈశ్వరరావు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కూరాకుల సింహాచలం, విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షులు వి.ఏడుకొండలు, ఉప సర్పంచ్ వస్కారెడ్డి, గ్రామ పెద్ద మోకా మధుబాబు, ప్రజా సంఘాల నాయకులు విప్పర్తి శ్రీనివాస్, కమిడి ఈశ్వరి బాయి, పోతుల రత్నకుమారి, వ్యవసాయ శాఖ విశ్రాంతి జెడి పి.సూర్యనారాయణ రాజు, ఉపాధ్యాయులు చెక్కా త్రిమూర్తులు, కాశి రవీంద్ర, త్రిమూర్తులు పాల్గొన్నారు.

జిల్లాలో ఓ మోస్తారు వర్షం

ప్రజాశక్తి-కొవ్వూరు

జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఓ మోస్తారు వర్షం కురిసింది. నల్లజర్ల మండలంలో అత్యధికంగా 17.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాజమహేంద్రవరం రూరల్‌లో 14.6, కడియంలో 12.4, నిడదవోలు, ఉండ్రాజవరం మండలాల్లో 10.4 మిల్లీమీటర్లు చొప్పున వర్షం కురిసింది. బిక్కవోలు, చాగల్లు, దేవరపల్లి మండలాల్లో 4.2 మిల్లీమీటర్లు చొప్పున, కొవ్వూరు కోరుకొండ మండలాల్లో 3.2 చొప్పున, గోపాలపురంలో 5.8, అనపర్తిలో 6.2 రాజానగరంలో 2.4 రంగంపేటలో 1.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. తాళ్లపూడి, సీతానగరం, గోకవరం మండలాల్లో వర్షం జాడ కనిపించలేదు. జిల్లాలో సరాసరిన 6 మిమీ వర్షం నమోదైంది.

లంకాలమ్మ జాతరలో పెందుర్తి పూజలు

ప్రజాశక్తి - సీతానగరం

టిడిపి యువ నాయకులు పెందుర్తి అభిరామ్ ఆదివారం ఇనగంటి వారిపేటలోని లంకాలమ్మ జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరలో భాగంగా జరిగిన వివిధ కార్యక్రమాల్లో ఆయన ఉత్సాహంగా పాల్గొన్నారు. అమ్మవారి ఈ జాతరకు స్థానిక ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా పెందుర్తి అభిరామ్ మాట్లాడుతూ లంకాలమ్మ జాతర ఎంతో ప్రాచీనమైనదన్నారు. ఈ జాతరలో కులమతాలకతీతంగా ప్రజలు పాల్గొని ఐక్యతను చాటుతారన్నారు. జాతరను ఘనంగా నిర్వహించిన గ్రామ కమిటీ సభ్యులను, ప్రజలను అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాజులోవ నమ్మిన సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్లాలి

ప్రథమ వర్ధంతి సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజులోవ నమ్మిన సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్లాలని, అదే ఆయనకిచ్చే నిజమైన నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అన్నారు. ఆదివారం స్థానిక శ్యామల సెంటర్ వద్దనున్న సిపిఎం జిల్లా కార్యాలయంలో రాజులోవ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా రాజులోవ చిత్ర పటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జువ్వల రాంబాబు, సీనియర్ నాయకులు పోలిన వెంకటేశ్వరావు, ఎస్ఎస్.మూర్తి పూలమాల వేసి జోహార్లు తెలిపారు. ఈ సంధ్బంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.పవన్ అధ్యక్షతన నిర్వహించిన సభలో అరుణ్ మాట్లాడారు. రాజులోవ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రౌతులపూడి మండలం రామకృష్ణాపురంలో జన్మించారన్నారు. ఆ గ్రామం నుంచి ఉన్నత చదువులు చదివిన కొద్దిమందిలో రాజులోవ ఒకరన్నారు. విద్యార్థి దశ నుంచే ఎస్ఎఫ్ఐలో చురుకైన పాత్ర పోషించాడని తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పెద్దాపురం, కాకినాడ, రాజమహేంద్రవరంలో వివిధ బాధ్యతల్లో పనిచేశారని తెలిపారు. యువజన సంఘం తదనంతరం కార్మిక సంఘం సిఐటియు జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారాని తెలిపారు. రాజులోవ అందరితో స్నేహంగా ఉండేవారని గుర్తు చేశారు. ప్రజా ఉద్యమాల్లో నిబద్ధతతో పని చేసిన నాయకుడన్నారు. ఉన్నత చదువులు చదివినా ఉద్యోగ అవకాశాలని వదిలిపెట్టి, ప్రజా ఉద్యమంలోనే పూర్తి కాలం కార్యకర్తగా పనిచేయడానికి తన కుటుంబాన్ని ఒప్పించి తన జీవితాన్ని ప్రజా ఉద్యమాలకు అంకితం చేశాడని తెలిపారు. ఎటువంటి భయం లేకుండా ధైర్యంగా పోరాటాల్లో ముందువరుసన ఉండేవారన్నారు. ఎన్నో నిర్బంధాలను ఎదిరించి ప్రజాపోరాటాలు నిర్వహించాడని గుర్తు చేశారు. సరళీకరణ ప్రభావాలతో నేడు యువత చెడు మార్గం పడుతుందన్నారు. అటువంటి కాలంలో తన జీవితాన్ని అభ్యుదయ ఉద్యమాల కోసం త్యాగం చేసిన రాజులోవ ఆశయం స్ఫూర్తిదాయకమన్నారు. రాజులోవను స్ఫూర్తిగా తీసుకుని యువత అభ్యుదయ, ప్రజా ఉద్యమాల్లో, వామపక్ష రాజకీయాల్లో భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. రాజులోవ వంటి కార్యకర్త లేకపోవడం ప్రజా ఉద్యమాలకు తీరనిలోటన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జువ్వల రాంబాబు మాట్లాడుతూ రాజులోవ ప్రజల కోసం జీవితాన్ని గడిపిన ధన్యజీవి అన్నారు. ఈ సభలో నాయకులు బివిఎస్.పూర్ణిమరాజు, ఎం.సుందరబాబు రాజులోవతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాజమహేంద్రవరం నగర కార్యదర్శి కర్రి రామకృష్ణ, నాయకులు ఐ.సుబ్రహ్మణ్యం, వి.రాంబాబు, సోమేశ్వరావు, అప్పల నరసయ్య, సుధ, రాజేష్, రమేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



రాజులోవకు నివాళులర్పిస్తున్న అరుణ్ తదితరులు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి - కొవ్వూరు

కొవ్వూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఉన్న మద్యం దుకాణాలు బార్ అండ్ రెస్టారెంట్లు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని సిఐ జి.సత్యనారాయణ హెచ్చరించారు. లైసెన్స్ నియమ నిబంధనలను అతిక్రమించినా, ఎంఆర్‌పి ధరల కంటే మద్యం అధిక ధరలకు విక్రయించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం విక్రయాలకు నిర్దేశించిన సమయపాలన కచ్చితంగా పాటించాలని సూచించారు. మద్యం దుకాణ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, అనధికారిక పర్మిట్ రూములను నడపరాదని ఆయన సూచించారు. ప్రతి మద్యం దుకాణదారుల రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. సిసి కెమెరాలు కచ్చితంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రాత్రిపూట కూడా తమ పెట్రోలింగ్ టీమ్‌లు తనిఖీలు నిర్వహిస్తాయన్నారు. ప్రజలు సమస్యలు తెలపడానికి 14405 కాల్ చేయాలని ఆయన సూచించారు. నాటు సారా తయారీ, అమ్మకుందారులపై, రవాణా చేసే వ్యక్తుల పైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన తరగతులు

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలం చంద్రవరం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. 'చదవడం మాకిష్టం' కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ కాసాని వెంకటేశ్వరరావు 'ఆలీబాబా 40 దొంగలు' కథను విద్యార్థులకు చెప్పారు. అనంతరం విక్రమ్ బేతాళ కథలు నుంచి రెండు చిలుకల కథ, సుకుమారి కథ విద్యార్థులతో చదివించారు. ప్రతి ఆదివారం జరిగే చదవటం మాకిష్టం కార్యక్రమంలో విద్యార్థులందరూ పాల్గొనాలని గ్రంథాలయాధికారి కె.సుమన్‌కుమార్ కోరారు. అలాగే చెస్ పోటీలు, క్యారమ్స్, లూడో తదితర ఆటలను నిర్వహించారు.

మానవతా ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం వర్షం కారణంగా 54 వ రోజు (వర్షం కారణంగా మజ్జిగ బదులుగా) మానవత కుటుంబ సభ్యులు ముళ్ళపూడి వెంకట రంగా ప్రసాద్ కుటుంబ సభ్యుల దాతత్వం తో టంటటి దుర్గాప్రసాద్ అకాలమరణంతో నిరాశ్రయులయిన చెల్లి(టి.చిన్నారి, మేనల్లుడు టి.అభి) కుటుంబానికి మానవత్వంతో ఒకనెలకు సరిపడా ప్రొవిజన్స్ , బియ్యం, నూనె, పంచదార పప్పు దినుసులు తదితరాల వితరణ మరియు రిటైర్డ్ ఎండిఓ ఆతుకూరి రామారావు,మంగాదేవి మనవరాలు కుమారి కుషిత చాందిని పుట్టినరోజు సందర్భంగా వారికి ఈ కాన్సెప్ట్ చెప్పిన వెంటనే అంగీకరించి ముందుకు వచ్చిన దాతలు ముళ్ళపూడి వెంకట రంగా ప్రసాద్ మరియు రిటైర్డ్ ఆతుకూరి రామారావు చాగల్లు మండలం మానవత స్వచ్ఛంద సేవాసంస్థ తరుపున ధన్యవాదాలు తెలియజేసిన ఛైర్మన్ జుజ్జవరపు వెంకటకష్ణ ప్రసాద్

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 సంవత్సరం పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు 25 ఏళ్ల తరువాత ఆదివారం కలుసుకున్నారు. ఈ ఆత్మీక కలయికకు నేలటూరు సీతారామ స్వామి కళ్యాణ మండపం వేదికైంది. కుటుంబ సభ్యులతో కలిసి ఈ కార్యక్రమంలో నాటి విద్యార్థులు పాల్గొన్నారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. నాటి ఉపాధ్యాయులు కోడి నాగేశ్వరరావు, మూర్తి సీతారాం, సతీష్, సత్యప్రసాద్, శ్రీదేవి, భారతి, రామశర్మలను ఘనంగా సత్కరించారు. సాయంత్రం వరకూ ఆట పాటలతో సరదాగా గడిపారు. ఆర్థిక ఇబ్బందులు పడుతున్న వారికి ఆర్థిక సాయం అందించారు. 150 విద్యార్థులు పాల్గొన్నారు

ఉగ్రవాదాన్ని సహించేది లేదు

ప్రజశక్తి -రాజమహేంద్రవరం రూరల్


ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లో భారత్ సహించబోదని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి స్పష్టం చేశారు. ఉగ్రవాదంతో అంటకాగుతూ భారత్‌పై విషం చిమ్ముతున్న పాకిస్తాన్ దుర్నీతిని అంతర్జాతీయ వేదికపై ఎండగట్టేందుకు కేంద్రం అఖిలపక్ష బృందాలను ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఎంపీ పురందేశ్వరి ప్రాతినిధ్యం వహిస్తున్న బృందం ఆదివారం ప్యారీస్‌కు పయనమైంది.ఉదయం 11గంటలకు ఢిల్లీ నుంచి బయలుదేరిన ఈ బృందం దుబాయ్ మీదుగా రాత్రికి పారిస్‌కి చేరుకుంది. ఫ్రాన్స్, యుకె, ఇయు, టలీ, డెన్మార్క్, జర్మనీ, దేశాల్లో పర్యటించి జూన్ 8న భారత్‌కి రానుంది. ఈ బృందానికి బిజెపి సీనియర్ నేత, ఎంపీ రవిశంకర్ ప్రసాద్ నాయకత్వం వహిస్తున్నారు. పహల్గాంలో పాకిస్తాన్ ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోవడం, అందుకు ప్రతిగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్', పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉగ్రవాదం గురించి ఈ బృందం వివరిస్తుంది. ఈ బందంలో పురందేశ్వరితో పాటు ఎంపీలు సామిక్ భట్టాచార్య, ప్రియాంక చతుర్వేది, డాక్టర్ అమర్ సింగ్, గులాం అలీ ఖటాన, ఎంజె అక్బర్, పంకజ్ శరన్ ఉన్నారు.

విరిగిన చెట్ల కొమ్మలు తొలగింపు

ప్రజాశక్తి - పెరవలి

ఈదురుగాలులు, భారీ వర్షాలకు నిడదవోలు, నరసాపురం మెయిన్ రోడ్డు పక్కన ఉన్న చెట్ల నుంచి ఈదురు గాలులు భారీ వర్షాలకు విరిగిపడిన చెట్టు కొమ్మలను ఆర్ అండ్ బి సిబ్బంది తొలగించారు. ఇటీవల కానూరు అగ్రహారం గ్రామానికి చెందిన చిర్రావూరి సూర్యనారాయణమూర్తి ఈ రహదారిలో వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఈ ప్రమాదలో ఆయన తొడలోకి చెట్టుకొమ్మ దిగబడింది. ఈ ఘటనతో అధికారులు ఎట్టకేలకు స్పందించారు. రోడ్డుపై విరిగిన చెట్ల కొమ్మలను తొలగిస్తున్నామని ఆర్ అండ్ బి ఎఇ శ్రీనివాస్ తెలిపారు.

కార్టూ'నిజం'



జయంతిలో కార్పొరేట్ స్థాయి విద్య

ప్రజాశక్తి - చాగల్లు



గ్రామీణ ప్రాంతంలో బాల బాలికలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్నామని జయంతి విద్యానికేతన్ స్కూల్ డైరెక్టర్ వి.వెంకటరావు, పద్మావతి తెలిపారు. పాఠశాల స్థితిగతులు, సాధించిన విజయాలపై ప్రజాశక్తితో వారు మాట్లాడారు,. పట్టణ ప్రాంతాలకే పరిమితమైన విద్యను గ్రామస్థాయికి తీసుకొచ్చామన్నారు. ప్రయివేటుకు దీటుగా ఫలితాలను సాధిస్తూ విద్యార్థులు తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. తమ విద్యాసంస్థల్లో చదివిని ఎంతో మంది ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. విద్యకే పరిమితం చేయకుండా కంప్యూటర్, డ్యాన్స్, కరాటే వంటి వాటిలో తర్ఫీదు ఇస్తున్నామన్నారు. డిజిటల్ క్లాసులు ద్వారా అధునాతన బోధన అందిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో నూరు శాతం విజయం సాధించామన్నారు. 2024-25 ఫలితాల్లో తమ విద్యార్థులు టి.గణేష్ 576, కె.వెన్నెల 567, ఆర్.సాయి 520, పి.త్రిశల 510, కె.జయశ్రీ 496 మార్కులు సాధించారన్నారు.



ఎ.వెంకటరావు



ఎ.పద్మావతి

:: పాఠశాల ప్రత్యేకతలు ::

1. నిపుణులైన ఉపాధ్యాయులతో విద్యా బోధన
2. సుదూర ప్రాంతాలకు బస్సు సౌకర్యం
3. సువిశాలమైన ఆటస్థలం
4. కార్పొరేట్‌కు ధీటుగా విద్యా బోధన
5. క్రీడల్లో ప్రత్యేక శిక్షణ
6. విద్యలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ
7. ఆంగ్లంలో పట్టుకోసం స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసులు
8. ఐఐటి, పాలిసెట్, ఎపిఆర్‌జెసిలో ఉత్తమ శిక్షణ



సర్పంచ్ చంటిని సత్కరిస్తున్న సమితి సభ్యులు

పురస్కార గ్రహీత చంటికి సత్కారం

ప్రజాశక్తి- కడియం

సేంద్రియ వ్యవసాయం చేస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నుంచి జీవవైవిధ్య పురస్కారం అందుకున్న మాధవరాయుడు పాలెం సర్పంచ్ ఆన్నందేవుల చంటిని ఆదివారం కడియం చెళ్లపిళ్ల వేంకట శాస్త్రి కళాసేవా సమితి ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ అవార్డు అందించే సమయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తాను చేస్తున్న ప్రకృతి వ్యవసాయం గూర్చి ప్రస్తావించి అభినందించారన్నారు. చంటిని అభినందించిన వారిలో రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు మార్గాని సత్యనారాయణ, కమిటీ ప్రతినిధులు అడపా సుబ్రహ్మణ్యం, చిలుకూరి శ్రీనివాసరావు, అలాగే గ్రామ సచివాలయాల సిబ్బంది, పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు ఉన్నారు.

నేరాలు ఘోరాలు

వంతాడ మైనింగ్ రోడ్‌లో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

వంతాడ లేటరైట్ క్వారీలో లారీలు కొండపై నుంచి కిందకు మట్టిని తరలించే క్రమంలో శనివారం రాత్రి రెండు లారీలు ఢీకొని ఇద్దరు మృతి చెందారు. ప్రమాదంలో లారీ క్యాబిన్లో ఇరుక్కుని బీహార్‌కు చెందిన ధీరజ్, చందన్ మృతి చెందారు. వీరిని ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చనిపోయిన వారి బంధువులు బీహార్‌లో ఉండడంతో మైనింగ్ యాజమాన్యం కానీ, అధికార యంత్రాంగం కూడా పట్టించుకోవడం లేదు. దీనిపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తనిఖీల్లో పాత నేరస్తుని అరెస్టు

ప్రజాశక్తి-తుని

తుని రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ ఆవరణంలో ఆదివారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో యానాంకు చెందిన కొల్లు ఏసుబాబుపై సుమారు 8 పాత కేసులు ఉన్నట్టు ఫింగర్ ప్రింట్ డివైస్ ద్వారా తేలింది. దీంతో అతడిపై బైండోవర్ కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

విద్యా కమిటీ చైర్మన్ ఆత్మహత్య

ప్రజాశక్తి- కరప

కాజులూరు మండలం గొల్లపాలెం పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కొలిశెట్టి సత్యం (40) శనివారం రాత్రి గొర్రిపూడి డ్రెయిన్‌లోకి దూకి ఆత్మహత్య పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.జ కాజులూరు మండలం గొల్లపాలెంలో బిర్యానీ సెంటర్ నిర్వహించే కొలిశెట్టి సత్యం గొల్లపాలెం జిల్లా పరిషత్ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి గొర్రిపూడి డ్రెన్‌లోకి ఆయన దూకి ఆత్మహత్యకు పాల్పడారడు. ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు గాలించడగా ఆదివారం సాయంత్రం మృతదేహం లభ్యమయ్యింది. పోస్టార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మరిడమ్మకు బంగారు నత్తు సమర్పణ

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి తుని గ్రామానికి చెందిన బర్ల కృష్ణగంగరాజు, మాధవీలత దంపతులు ఆదివారం రూ.3,80,000 విలువైన బంగారు నత్తును అందజేశారు. వీరు ఈ నత్తును ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మికి అందజేశారు. అనంతరం వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

అంజూరి రాంబాబుకు సత్కారం

ప్రజాశక్తి-గొల్లప్రోలు

వైసిపి జిల్లా కార్యదర్శిగా ఇటీవల పట్టణానికి చెందిన అంజూరి రాంబాబు నియమితులు కావడంతో ఆదివారం ఆయనను పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షుడు వంపన రామకృష్ణ పలువురు కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీలకు అతీతంగా పద్మశాలీలకు వైసిపి గుర్తింపు ఇచ్చిందని రాంబాబు అన్నారు. పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాటిశెట్టి మధుబాబు వంపన సూర్యనారాయణ, సూరిశెట్టి సూరిబాబు, మొండి లోవరాజు, సత్తిబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మృతులకు రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

వంతాడ మైనింగ్ యాజమాన్యం నిర్లక్ష్యంతో మృతి చెందిన బీహార్ యువకులకు రూ.25 లక్షల పరిహారం వెంటనే అందజేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు దువ్వా శేషబాబ్జీ డిమాండ్ చేశారు. మైనింగ్ యాజమాన్యంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తక్షణమే స్పందించి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మైనింగ్ లారీలు భారీగా వర్షం కురిసినప్పటికీ లారీలు కిందకి దిగడంతోనే ప్రమాదం జరిగిందని అధికార యంత్రం పూర్తిగా వైఫల్యం చెందడంతోనే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. మైనింగ్ యాజమాన్యం ఏ పార్టీ అధికారంలో ఉన్న వాళ్లతో కుమ్మక్కై ఇష్టారాజ్యంగా దోచుకు తింటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనింగ్ యాజమాన్యాలకు ప్రజాప్రతినిధులు వత్తాసు పలకడంతోనే ఇటువంటి సంఘటనలు జరుగుతున్న ప్పటికీ సామాన్య ప్రజలు నోరు మెదపడం లేదన్నారు. తక్షణమే బాధిత కుటుంబాలకు న్యాయం చేయలేపోతే ఉద్యమం చేపడుతామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

27న రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-కాకినాడ

ప్రభుత్వ వైద్య కళాశాలలు-ప్రైవేటీకరణ అనే అంశంపై ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు కాకినాడ యుటిఎఫ్ బిల్డర్స్ హోమ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రజారోగ్య వేదిక నగర కన్వీనర్ పి.శ్రీనివాస్ ఒక ప్రకటన లో తెలిపారు. ప్రభుత్వ వైద్య, ఆరోగ్య రంగాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయింపులు పెంచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య కళాశాలలో ప్రైవేటీకరణ చేసే సామాన్యులకు వైద్యం ఏవిధంగా అందుబాటులో ఉంటుందో ఆలోచించాలన్నారు. ఈ నేపథ్యంలో నిర్వహిస్తున్న రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రభుత్వ వైద్య, ఆరోగ్య రంగాలు బలోపేతం కావాలని కోరుకునే వారు పాల్గొనాలని కోరుతున్నామని శ్రీనివాస్ ఆ ప్రకటనలో తెలిపారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ ఆనందరావు

పవర్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక సిఏ రామన్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలను ఆదివారం ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి ప్రధాన కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, నాయకులు చిక్కాల గణేష్, ఆశెట్టి ఆదిబాబు, వంటెద్దు వెంకన్నాయుడు, సివి రామన్ స్కూల్ కరస్పాండెంట్ రవణం వేణుగోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయ వంతెనకు ముప్పు

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రసిద్ధి చెందిన సామర్లకోట శ్రీ భీమేశ్వర స్వామి దేవాలయానికి వెళ్లే గోదావరి కాలువపై నిర్మించిన నూతన ప్రధాన వంతెనను ఇటీవల ఒక హెవీ వెహికల్ ఢీకొని ప్రధాన రైలింగ్ దెబ్బతింది. పాత బ్రిడ్జి పూర్తిగా శిథిలం కావడంతో పెద్దాపురం ఎంఎల్ఎ నియోజకవర్గ చినరాజప్ప రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి హోమ్ మంత్రి హోదాలో ఉండగా బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి, నిర్మాణం పూర్తి చేయించారు. ఇటీవల సాగర్ మాల రహదారిని నిర్మాణం నేపథ్యంలో భారీ బరువు లోడింగ్‌తో కూడిన మెటీరియల్ టిప్పర్లు ఈ బ్రిడ్జి పైనుంచి భీమేశ్వర ఆలయం మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. కేవలం ఆలయానికి వచ్చే వాహనాలు, కల్లు వెంబడి ఉన్న రైతుల ప్రయోజనార్థం నిర్మించిన ఈ బ్రిడ్జిపై నిత్యం వందలాది మోతాదుకు మించిన బరువుతో టిప్పర్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇటీవల ఒక డ్రైవర్ నిర్లక్ష్యంగా బ్రిడ్జి మొదటి భాగాన్ని ఢీకొట్టి వెళ్లిపోయాడు. ఈ బ్రిడ్జిపై నిర్మిత సామర్థ్యాన్ని మించి భారీ లోడ్ వెహికల్స్ ప్రయాణించడం వల్ల బ్రిడ్జి మాత్రమే కాకుండా రైతులు నిర్మించుకున్న పక్క రహదారులు కూడా దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగర్ మాల రోడ్డు నిర్మాణ పనుల కోసం అధిక బరువున్న వాహనాలు తరచూ ఈ మార్గాన్ని వినియోగిస్తున్నాయి. దీనివల్ల భద్రతకు ముప్పు ఏర్పడుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, దేవాదాయశాఖ అధికారులు, ఆర్ అండ్ బి శాఖ అధికారులు, రైతుసంఘం ప్రతినిధులు కలిసి పరిశీలించి, హైకెపాసిటీ వెహికల్స్ రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



గోదావరి కాల్వపై ఉన్న ఆలయ బ్రిడ్జిని ఢీకొట్టగా దెబ్బతిన్న రైలింగ్

'సినీ పరిశ్రమ వివాదాల్లోకి నన్ను లాగొద్దు'

ప్రజాశక్తి-కాకినాడ

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన హరిహర వీరమల్లు చిత్రం విడుదల కాకుండా తనతోపాటు కొంతమంది సినీ నిర్మాతలు కుట్ర పన్నారంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని కాకినాడ సిటీ మాజీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి ఆదివారం ఆయన ఒక ప్రకటనలో ఖండించారు. జూన్ 1వ తేదీ నుంచి సినిమా థియేటర్లు బంద్ చేయాలన్న ప్రతిపాదన సినీ పరిశ్రమ, థియేటర్ యజమానులు, ఎగ్జిబిటర్లకు సంబంధించిన అంతర్గత వ్యవహారమని ద్వారంపూడి పేర్కొన్నారు. ఈ అంశంతో తనకు ఎలాంటి సంబంధమూ లేదని ఆయన చెప్పారు. పూర్తిగా సినీ పరిశ్రమకు సంబంధించిన ఈ వ్యవహారంలో నిర్మాతల మండలి ప్రతినిధి నట్టి కుమార్ చేసిన వ్యాఖ్యలను ఏమాత్రం ధ్రువీకరించుకోకుండా కొన్ని మీడియా సంస్థలు అనవసరంగా తన పేరును వివాదం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఈ వివాదంలో తన పాత్ర పై ఏమైనా ఆధారాలు ఉంటే చూపించి విమర్శలు చేయాలని ఆయన హితవు పలికారు. నిజ నిర్ధారణ చేసుకోకుండా సినీ పరిశ్రమ వివాదాలలోకి తనను లాగడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఇటీవలి కాలంలో సినీ పరిశ్రమకు చెందిన ఏ ఒక్కరిని తాను కలవలేదని ఆయన స్పష్టం చేశారు. రాజకీయాల్లో ఉన్నానన్న అక్కస్సుతో ఏదో ఒక వివాదంలోకి లాగి తప్పుడు విమర్శలు చేయడం, అబద్ధాన్ని నిజం చేసేలా పదేపదే ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు.

సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్దాం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్దామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పి.రవికుమార్ అన్నారు. జూన్ 5న ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మూడవ రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి సిఎం హాజరవుతారని తెలిపారు. జిల్లా నుంచి ఉద్యోగులు అధిక సంఖ్యలో విచ్చేసి సభను జయప్రదం చేయాలని కోరారు. ఎన్నడూ లేని విధంగా గత ఐదారేళ్లుగా ఉద్యోగులకు సంబంధించిన వివిధ బకాయిలు పేరుకుపోయాయన్నారు. వీటిని వెంటనే చెల్లించాలన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో పాక్షికంగానే చెల్లింపులు జరిగాయన్నారు. పూర్తి స్థాయిలో వీటిని చెల్లించే విధానాన్ని ప్రకటించాలన్నారు. పెండింగ్ డిఎలతో పాటు పిఆర్‌సి వేసి ఐఆర్ ప్రకటించాలన్నారు. వైద్య రంగంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ పరిధిలో ఉన్న ఆసుపత్రుల్లో అవుట్ పేషెంట్ రోగుల సంఖ్య ఇన్ పేషెంట్ రోగుల సంఖ్య పెరిగిన కారణంగా కేడర్ స్ట్రెంగ్త్ మార్చి ఉద్యోగుల సంఖ్య పెంచాలన్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. గతంలో ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ పరిధిలో జిల్లా ఆసుపత్రులుగా ఉన్న ఐదు ఆసుపత్రులను మెడికల్ కాలేజీలకు అనుబంధంగా ప్రభుత్వ సామాన్య ఆసుపత్రులుగా మార్చారన్నారు. ఈ సందర్భంలో జోనల్ కేడర్‌గా ఉన్న రేడియో గ్రాఫర్ల సంఖ్య ఏమాత్రం పెరగలేదన్నారు. రాజమండ్రిలో కేవలం ముగ్గురు రేడియోగ్రాఫర్లు ఒక్క పాటర్న్‌లో ఉన్నారన్నారు. రెండు పోస్టులు ఖాళీ ఉండగా ఒక రేడియోగ్రాఫర్ మాత్రమే ఉన్నాడని తెలిపారు.ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి 24 గంటలు షిఫ్ట్ డ్యూటీల కోసం 10 మంది రేడియోగ్రాఫర్లు అవసరమన్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వ సామాన్య ఆసుపత్రుల్లో వెంటనే రేడియోగ్రాఫర్ల పోస్టులు భర్తీ చేయాలన్నారు.

సత్తిబాబు కుటుంబానికి బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి - మండపేట

పట్టణంలోని 15వ వార్డుకి చెందిన టిడిపి కార్యకర్త కొమ్మిశెట్టి సత్తిబాబు ఇటీవల ఒక ప్రమాదంలో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో టిడిపి సభ్యత్వ బీమా సొమ్ము రూ.5 లక్షల చెక్కును బాధిత కుటుంబానికి ఆదివారం రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు అందజేశారు. తమ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకున్న సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, మాజీ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, పట్టణ అధ్యక్షులు మత్తా నాగబాబు, 15వ వార్డు కౌన్సిలర్ గండి వీరవెంకట శ్రీనివాస్, టిడిపి అధ్యక్షులు పాలచర్ల వెంకన్నబాబు, గున్న శ్రీను, శిరంగి ఈశ్వరరావు, కాశిన కాశీవిశ్వనాథం, ఎం.సూర్యప్రకాష్, వాడా ప్రసాదరావు, అల్లూరి రామకృష్ణవేదరి, కార్యకర్తలు పాల్గొన్నారు.



బీమా చెక్కును అందిస్తున్న ఎంఎల్ఎ వేగుళ్ల

టెన్త్ టాపర్‌కి రూ.10 వేల ప్రోత్సాహం

ప్రజాశక్తి - మామిడికుదురు

పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన మొగలికుదురుకు చెందిన కొల్లాబత్తుల మహాలక్ష్మికి మాజీ ఎంఎల్ఎ రాపాక వరప్రసాద్ చేతుల మీదుగా రూ.10 వేలు ఇచ్చి ప్రోత్సహించారు. ఆదివారం గొందిలో కొల్లాబత్తుల శీను ఇంటివద్ద కొల్లాబత్తుల కింగ్స్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మహాలక్ష్మికి మాజీ ఎంఎల్ఎ రాపాక చేతుల మీదుగా రూ.10 వేలతోపాటు, మెమొంటో ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొల్లాబత్తుల కింగ్స్ సోదరులు అశోక్ కుమార్, శ్యామ్‌బాబు, విజయ్‌కుమార్, శ్రీను, నాని, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మహాలక్ష్మికి నగదు ప్రోత్సాహం అందిస్తున్న మాజీ ఎంఎల్ఎ రాపాక

గుంతలమయంగా ప్రక్కిలంక-నరసాపురం రోడ్డు

ప్రజాశక్తి - పెరవలి

ప్రక్కిలంక- నరసాపురం మెయిన్ రోడ్డు గోతులతో శిథిలమైంది. భారీ వాహనాలు రద్దీ పెరగడం, వర్షాల కారణంగా భారీ గోతులు ఏర్పడ్డాయి. దీంతో, వాహనదారులు ఈ గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. వేసవి సీజన్ ప్రారంభం నుంచి నియోజకవర్గంలో ఇసుక ర్యాంపులు నుంచి అధిక ఇసుక లోడ్ లారీలు, మెటల్‌ను తరలించే లారీలు ఈ రహదారి గుండానే ప్రయాణిస్తున్నాయి. దీంతో రోడ్డు కుంగిపోయి గుంతలు ఏర్పడుతున్నాయి. కానూరు -ఉసులుమర్రు గ్రామాల మధ్య రోడ్డు శిథిలమై ఎత్తు గుమ్మన్నట్టు రోడ్డును మాత్రం నేటికీ వేయలేదు. రెండు కిలోమీటర్ల పొడవున రోడ్డు గుంతలమయంగా మారింది. వర్షాలకు గోతుల్లో నీరు చేరడంతో ఏది రోడ్డో, ఏది గుంతో తెలియక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. పలువురు వాహనదారులు ఈ గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. గత ప్రభుత్వంలో రోడ్డు వేసిన ఏడాదికే కుంగి పోయింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంది. దీంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపుల పంట కాలువ, ముదురు కాలువలు ఉన్నాయి. మరోపక్క మెయిన్ కెనాల్ ఉంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. మంత్రి దుర్గేష్, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.



పెద్ద గుంతలతో అధ్వానంగా ఉన్న రోడ్డు

శునకాలు స్వైర విహారం

ప్రజాశక్తి - గోపవరం

మండలంలోని గుమ్మళ్ళదొడ్డిలో శునకాల స్వైర విహారంతో గ్రామస్తులు బెంబేలెత్తుతున్నారు. నిత్యం కుక్కల దాడిలో పాడి పశువులు, చిన్నారులు గాయాల బారిన పడుతున్నారు. ఇటీవల కాలంలో ఇంటి వద్ద కూర్చున్న ఒక మహిళపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. పంచాయతీ కార్యాలయం ఎదురుగానే ఈ ఘటన జరిగినప్పటికీ అధికారులు ఏమాత్రం స్పందించలేదు. శనివారం కుక్కల దాడిలో ఆవు దూడ చనిపోగా, మరో రెండు ఆవులకు గాయాలయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఎస్‌పి డి.నరసింహకిషోర్ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఎయిర్ పోర్ట్, బస్టాండ్, రైల్వే స్టేషన్లు, సినిమా హాళ్లు, రెస్టారెంట్లు, షాపింగ్ మాల్స్, లాడ్జిలు, జనసంచార ప్రదేశాల్లో ఈ తనిఖీలు జరిగాయి. అనుమానితులను ప్రశ్నించారు. ఎవరైనా అపరిచిత తులను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సిసి కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు.

కాకినాడలో నేడు ట్రాఫిక్ మళ్లింపు

ప్రజాశక్తి-కాకినాడ

ఏపి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం 6 గంటలకు మెగా యోగా కార్యక్రమం నిర్వహిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ భావన ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం రామారావుపేట ఎండోమెంట్ డిపార్ట్మెంట్ రోడ్డులో ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలో నూకాలమ్మ గుడి సెంటర్ నుంచి మూడు లైట్ల జంక్షన్ మీదుగా సిటిఎం స్కూల్ నుంచి పాత బస్టాండ్ వైపునకు ట్రాఫిక్ మళ్లిస్తామని తెలిపారు. ప్రజలు దీన్ని గమనించి మున్సిపల్, ట్రాఫిక్ సిబ్బందికి సహకరించి ప్రభుత్వం చేస్తున్న ఈ బృహత్ కార్యక్రమానికి ప్రజలందరూ హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి సహకరించాలని కోరారు. తమ ఆరోగ్య రక్షణ కోసం చేపడుతున్న ఈ యోగా కార్యక్రమంలో పాల్గొనాలని కమిషనర్ భావన ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఉత్కంఠ భరితంగా ఈత పోటీలు

ప్రజాశక్తి - సామర్లకోట

బాలబాలికల ఈత పోటీల జట్టు ఎంపిక సందర్భంగా ఆదివారం నిర్వహించిన ఈత పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. జూన్ నుంచి పల్నాడు జిల్లా నరసరావుపేట ఎస్ఎస్ఎన్ కాలేజీలో 11వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల కోసం ఆదివారం సామర్లకోట దుర్గాప్రసాద్ పబ్లిక్ స్కూల్లో ఈ పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి బాలుర విభాగంలో కె.ధనంజయ, కె.ముత్యాల ముకేష్, కె.నాగకృష్ణ, పివిఎస్ ప్రభాకర్, పి.సాయి ధనుష్ రాజ్, ఆర్.వెంకటేష్, కె.దొరస్వామి, ఎల్.రాకేష్, బాలికల విభాగంలో ఎ.షణ్ముఖశ్రీ సాయి, పికెవిపి సహస్రశ్రీ ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డి సతీష్, ఇనుసుమల్ల రాజు, మంగా వెంకట శివరామకృష్ణ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు డ్రంక్ అండ్ డ్రైవ్

ప్రజాశక్తి-కాజులూరు

ప్రమాదాలను నివారించుటకే డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని ఎస్ఐ ఎం.మోహన్ కుమార్ తెలిపారు. ఆదివారం మండలంలోని కోలంక శివారులో డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మోహన్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో ఇటీవల చోరీలు జరుగుతున్నాయని, నెంబర్ లేని వాహనాలను, మద్యం సేవించి వాహనాలు నడిపేవారిని రికార్డులు సరిగా లేని వారిపై దృష్టి సారించామన్నారు. ఈ తనిఖీల్లోమూడు కేసులు నమోదు చేసి సోమవారం కోర్టుకు పంపించనున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో సిబ్బంది తిరుపతి నాయుడు, శేషు కుమార్, శేఖర్ పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాలు పూడ్చివేత

ప్రజాశక్తి-ఏలేశ్వరం

చేపల చెరువులలో అక్రమంగా కోడి వ్యర్థాలను కలుపుతూ ప్రజల జీవితాలతో ఆడుకుంటున్న వారిపై శనివారం పోలీసులు చర్యలు చేపట్టారు. ఎస్ఐ ఎన్.రామలింగేశ్వర రావు తెలిపిన వివరాలివి. మండలంలోని చేపల చెరువులకి వ్యాన్‌లో కోళ్ల వ్యర్థాలు తరలించి కలుపుతున్నారనే సమాచారంతో తనిఖీలు నిర్వహించగా తిరుపతి పాడు వద్ద ఒక వాహనాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. వ్యాన్‌లో ఉన్న చికెన్ వ్యర్థాలను గొయ్యి తవ్వి పాతిపెట్టామన్నారు. వాహనం డ్రైవర్‌పై కేసు నమోదు చేశామన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్మన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో వైస్ చైర్మన్, మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొంటారన్నారు. సిబ్బంది సకాలంలో హాజరు కావాలని కోరారు.



కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

జగ్గయ్య చెరువు కాలనీలో కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి-పిఠాపురం

స్థానిక జగ్గయ్య చెరువు కాలనీలో సిఐ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీస్ పరిధిలోని ఎస్ఐలు సిబ్బందితో కలిసి కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఆ ప్రాంతంలో పూర్తిగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాస్ మాట్లాడుతూ వాహనాల తనిఖీలు చేసి సరైన పత్రాలు లేని సుమారు 43 బైకులను సీజ్ చేశామని, 15 లీటర్ల నాటు సారా సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు, అనుమానితులు కనిపించిన, ఏదైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఇంటి యజమానులు కొత్త వ్యక్తులకు ఇళ్లు అద్దెకిచ్చేటప్పుడు వారి వివరాలను పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు మణికుమార్, జాన్ బాషా, రామకృష్ణ, వెంకటేష్‌తో పాటు పోలీస్ సిబ్బంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చెందుర్తిలో అక్రమంగా గ్రావెల్ తరలింపు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

మండలంలోని చెందుర్తిలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు సాగుతున్నాయి. పుష్కర కాలువ గట్టు నుంచి యథేచ్ఛగా గ్రావెల్‌ను తవ్వి లేఅవుట్లలో ఫిల్లింగ్ చేస్తున్నారు ఈ అక్రమ దందా రాత్రులు జరుగుతోందని స్థానికులు తెలిపారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న వారిపై సంబంధిత అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ఎన్‌టిఆర్ కాలనీలో పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎస్ఐ వి.మౌనిక ఆధ్వర్యంలో పోలీసులు స్థానిక ఎన్‌టిఆర్ కాలనీలో అనుమానిత గృహాల్లో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్రువపత్రాలు సక్రమంగా లేని బైకులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

నేటి నుంచి యోగాంధ్ర-2025

ప్రజాశక్తి - సామర్లకోట

జూన్ 21 ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ వద్ద సోమవారం నుండి యోగా కార్యక్రమాలు ప్రారంభిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఆనెట్టి శ్రీవిద్య ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 6 గంటలకు గాంధీబొమ్మ సెంటర్ వద్ద యోగా శిక్షణ తరగతులు జూన్ 21 వరకు ప్రతిరోజూ ఉదయం నిర్వహిస్తారన్నారు. సామాజిక ఆరోగ్యం, శారీరక దఢత్వం కోసం ప్రజలు స్వచ్ఛందంగా ఈ యోగా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు.

మరిడమ్మ ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మరిడమ్మ ఆలయంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఆదివారం సుదూర ప్రాంతాల నుండి అమ్మవారిని దర్శించుకునేందుకు యాత్రికులు వస్తుంటారన్నారు. దాతల సహాయ సహకారాలతో వీరందరికీ అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. ఈ అన్నదాన కార్యక్రమంలో ఆలయ ఆసాదులు రాయి నాని, రామచంద్రప్రసాద్, వేద పండితులు ఐవి.ప్రసాద్ శర్మ, ఎస్‌వి.అవధాని, శంకర్, ఆలయ సిబ్బంది రమణ, వరహాలు, శివ తదితరులు సహాయ సహకారాలు అందించారు.



డ్రాయింగ్ పోటీల్లో విజేతలు

వేసవి శిబిరంలో డ్రాయింగ్ పోటీలు

ప్రజాశక్తి-పెద్దాపురం

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ఆదివారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం రాళ్లపల్లి వెంకటేశ్వరరావు, తెలుగు ఉపాధ్యాయుడు తాటిగడ్డ సుబ్బారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చదవడం, కథలు చెప్పడంలో అవగాహన కల్పించారు. నీతి శతక పద్యాలను భావార్థంగా ఆలకించి వాటి సారాంశంపై అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు బి.అరవింద్, ఎం.రామారావు, పి.రాజేష్ పాల్గొన్నారు.



పాము శ్రీనివాస్‌ ను అభినందిస్తున్న సభ్యులు

ట్రెజరీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా శ్రీనివాస్

ప్రజాశక్తి-కాకినాడ

ఏపి ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా పాము శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈ మేరకు కాకినాడలో పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆదివారం విజయవాడలోని ఏపి ఎన్‌జిఒ అసోసియేషన్ హోమ్‌లో ఈ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికలలో అధ్యక్షునిగా పాము శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా దేవిశెట్టి రమణారెడ్డి, సహాధ్యక్షునిగా డి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా బి.సుజాత, జి.జగదీష్, టి.ఉదయ భాస్కరరావు, పి.హరిబాబు, పివివిఎల్.వరకుమార్, టిఆర్ఎస్ మురళీధర్ రాయుడు, జె.రవికుమార్, కార్యదర్శులుగా కె.మమత, ఎస్.దివ్యభారతి, ఎ.శ్రీనివాసరావు, బి.ఆక్కేశ్వరరావు, పి.విశ్వనాథ్, కరుణాకర్, ఎస్.రమేష్, ఎం.రమణసుందర్, కె.శాంతి, కోశాధికారిగా బొత్స శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సంక్షేమం లేకుండా పేదరిక నిర్మూలన ఎలా?

ప్రజాశక్తి - అమలాపురం

సంక్షేమ పథకాలను అమలు చేయకుండా రాష్ట్రంలో పేదరికాన్ని ఎలా నిర్మూలిస్తారని వైసిపి నాయకులు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు ఆదివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఎన్నికల ముందు కూటమి పార్టీల నాయకులు సూపర్ సిక్స్ పథకాలను ప్రకటించారని, అయితే అధికారంలోకి వచ్చాక ఆ పథకాలను పక్కన పెట్టారని విమర్శించారు. ప్రతిరోజూ సూపర్ సిక్స్ పథకం కోసం పేద ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా సూపర్ సిక్స్ పథకాలు ఇవ్వకుండా పేదరిక నిర్మూలన ఎలా సాధ్యమని ప్రశ్నించారు.

నేడు యథావిధిగా పిజిఆర్‌ఎస్

ప్రజాశక్తి - అమలాపురం

ఈ నెల 26వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి కలెక్టరేట్లో పిజిఆర్‌ఎస్ కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు 1100 కాల్ సెంటర్ ద్వారా తమ ఫిర్యాదుల పరిష్కార స్థితిని తెలుసుకోవచ్చున్నారు. ఏవైనా సందేహాలు ఉంటే అదుగ వచ్చునని, కొత్త ఫిర్యాదులను నమోదు చేయవచ్చున్నారు. ప్రజల సౌలభ్యం కోసం జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్లు, 22 మండల కేంద్రాలు, 4 మున్సిపల్ కార్యాలయాల్లో పిజిఆర్‌ఎస్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కావున అర్జీదారులు ఆయా స్థాయిల్లో తమ సమస్యలను అర్జీల ద్వారా తెలియచేయవచ్చునని తెలిపారు.

ప్రకటన

నా క్లయింట్ తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం నరసాపురం గ్రామ కాపురస్తురాలు పికా...

రాజమండ్రి 25-05-2025

కవి హనుమంతరావు, అడ్వకేట్, సీతంపేట రాజమండ్రి 9849690996